తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## రెండు లారీలు ఢీ : ఒకరి పరిస్థితి విషమం

కుప్పం రూరల్ డిసెంబర్ 15 ప్రభాతవార్త :



కుప్పం- క్రిష్ణగిరి జాతీయ రహదారిలో మండలంలోని నడిమూరు గాట్ వద్ద రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. ఈ సంఘటనకు సంబందించి స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా కర్ణాటక రాష్ట్రం బలమందకు చెందిన శంకర్, గుంటూరుకు చెందిన నాగయ్యలు వేరువేరు లారీలలో వస్తూ నడిమూరు గాట్‌వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి దీంతో నాగయ్యకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

### ఉత్సాహంగా....ఆధ్యాత్మిక భావంతో
## గోవిందుని దర్శనంలో రజినీకాంత్

తిరుమల, డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:



సినీజీవితంలోనేకాదు.... నిజజీవితంలో కూడా సూపర్‌స్టార్ రజినీకాంత్ ఉత్సాహంగా కనబడుతుంటాడు. ఇటీవల 72వ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న రజినీకాంత్ కుమార్తె సౌందర్యతో కలసి తిరుమలకు చేరుకున్నారు. గురువారం వేకువజామున ఆలయంలో సుప్రభాత సేవలో గోవిందుని దర్శనం చేసుకున్నారు. వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ మార్గంలో, ఆలయంలోపల భక్తితో, ఎంతో చలాకీగా రజినీ నడవడం అందరినీ ఆకట్టుకుంది.

# అనీమియా నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- -హౌసింగ్ లే అవుట్‌లలో నిర్మాణాలు వేగవంతం చేయాలి
- - రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహార్‌రెడ్డి
- -పాఠశాలలో విద్యార్థుల డ్రాపౌట్స్ శాతాన్ని తగ్గించాలి
- - బడి బయట పిల్లలందర్ని బడిలో చేర్పించాలి
- -వారం లోపు కాన్పు జరిగే గర్భిణీలపై రక్షిత కాన్పుపై చర్యలు
- - తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి



తిరుపతిరూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త:

జిల్లాలో అనీమిమా నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహార్‌రెడ్డి ఆదేశించారు. స్పందన వినతులను సకాలంలో పరిష్కరించాలని, హౌసింగ్ లే అవుట్‌లలో నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అమలులో భాగంగా ప్రసూతి మరణాలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను సి.ఎస్. ఆదేశించారు. గురువారం అమరావతి నుండి పంచాయతీ రాజ్ కమీషనర్ కోనా శశిధర్, సిద్దార్థ జైన్ సంబంధిత కమీషనర్లు, కార్యధర్శులతో వీడియో కాన్ఫరేన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్, జె.సి., సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ కాన్ఫరేన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, బియాండ్ ఎస్.ఎల్.ఎ.కి వెళ్ళకుండా అర్ధవంతంగా పరిష్కారం చూపించి, సంబంధిత అర్జీదారునితో క్షేత్రస్థాయి ఫోటో యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మాణాలను దశల వారీగా కన్వర్టన్‌లో పురోగతి ఉండేలా వేగవంతం చేయాలని తెలిపారు. హౌసింగ్ లే అవుట్‌లలో అన్ని మౌలిక వసతులు విద్యుత్, ఇంటింటికి త్రాగునీరు వసతి కల్పించి, నిర్ధేశించిన గడువులోపల పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పిఎంఏవై గ్రామీణ్ మీద దృష్టి పెట్టాలని, జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్స్ ఈనెల 21లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆప్షన్-3 ఇళ్లకు ఎస్‌హెచ్‌జిల ద్వారా లోన్లు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రతి శనివారం హౌసింగ్ డే గా అన్ని మండలాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి హౌసింగ్‌లో పురోగతి తీసుకురావాలని కోరారు. క్లాస్ మిత్ర గౌరవ వేతన బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లించాలని, బిల్లులు ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. చెత్త నుండి సంపద కేంద్రాల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాకుండా ఉంటే నిర్మాణాలు వేగవంతం చేసి త్వరగా ప్రారంభించాలన్నారు. ఇంటింటి నుండి చెత్త సేకరించి సంపద కేంద్రాలకు రవాణా చేయడం, వాటి ట్రీట్‌మెంట్, డిస్పోసల్ అంతటినీ సరైన రీతిలో అమలు అయ్యేలా పర్యవేక్షించాలన్నారు. వివరాలను జే.ఎస్.ఎస్. యాప్ నందు అప్‌లోడ్ నందు అప్‌లోడ్ చేయాలని సూచించారు. జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్షలో భాగంగా రీ సర్వే వేగవంతం చేయాలని, ఫిబ్రవరి 2023 నాటికి 2వేల గ్రామాలలో పూర్తిస్థాయిలో గ్రౌండ్ ట్రూథింగ్, 9(2) నోటీసులు, 13 నోటిఫికేషన్ జరిగిలా చర్యలు చేపట్టాలని సిద్దార్థ జైన్ తెలిపిన అంశాలపై చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు సమీర్ శర్మ సూచించిన మేరకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా వాలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏ.ఎన్.ఎం.లు ప్రత్యేక శ్రద్ద వహించి నిర్ధేశిత 8 ఇండికేటర్‌లు, 4 పారా మీటర్లవారీగా రక్తహీనత, పోషక ఆహార లోపం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణీలకు, బాలింతలకు, కౌమారదశ అమ్మాయిలకు అనీమియా తగ్గుంచుటకు పౌష్టిక ఆహారం, జగనన్న గోరుముద్ద, ఐరన్ మాత్రలు అందేలా వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖ డి.ఇ.ఓ, సంక్షేమశాఖల అధికారులు చర్యలు తీసుకుని పురోగతి చూపించాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థులు నమోదు, డ్రాపౌట్స్ సంఖ్య సమీక్షించుకుని, బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించే దిశగా విద్యాశాఖ అధికారులు, సచివాలయ ఎడ్యుకేషన్ ఎనిమిటి సెక్రటరీలు, వాలంటీర్లు పర్యవేక్షించి కన్సిస్టెంట్ రిథం యాప్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సి.ఎస్. సూచించిన మేరకు హాస్పిటల్ డెలవరీలను ప్రోత్సహించి మాతా శిశు మరణాలు తగ్గించే దిశగా జిల్లాలో ముఖ్యంగా వారంలోపు కాన్పు జరిగే గర్భిణీల జాభితా సిద్ధం చేసుకుని, మాతా శిశు మరణాలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు చర్యలు చేపట్టాలన్నారు. అనిమీయా పరీక్షలు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో శ్రీనివాసరావు, సర్వే ఏ.డి. జయరాజ్, జిల్లా ప్లానింగ్, స్టాటికల్ ఆఫీసర్ అశోక్‌కుమార్, డిఎల్‌డిఓ సుశీలాదేవి, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిణి జయలక్ష్మీ, హౌసింగ్ పి.డి. శ్రీనివాసప్రసాద్, డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డిపిఓ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యు ఎస్ఇ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు బోల్తా

### 15మందికి గాయాలు
### - తమిళనాడు నుంచి వస్తుండగా చందంలో సంఘటన !!





కుప్పంరూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త

ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈసంఘటనలో 15మందికి గాయాలు కాగా వీరిని చికిత్స నిమిత్తం హుటాహుటిన కుప ్పం ఏరియా ఆస్పత్రి, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. కాగా ఈ ప్రమాదంలో ప్రయాణీకులు గాయాలతో బయటపడడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. కుప్పం ఆర్టీసీ డిపోకు చెందిన ఎపి21జెడ్ 0346నెంబరు గల బస్సు గురువారం ఉదయం 8.30గంటల ప్రాంతంలో తమిళనాడులోని తిరుపత్తూరు నుంచి ప్రయాణీకులతో బయలుదేరింది. కాగా కుప్పం మండలం చందం గ్రామ సమీపంలో ఓ ద్విచక్రవాహనంలో ముగ్గురు గుర్తు తెలియని యువకులు ఎదురుగా వేగంగా వచ్చారని డ్రైవర్ గంగాధర్ తెలిపాడు. ఈ నేపథ్యంలో వారిని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. బస్సు బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న తిరుపత్తూరుకు చెందిన కళమ్మ (87), మిట్టపల్లికి చెందిన మురుగమ్మ (39), శాలమ్మ (56), పాంచాలమ్మ '(68'), అప్పలదొర (70), ఫైజా (23) వేపూరుకు చెందిన వెంకటేష్ (72), జయలక్ష్మి (56), ఉమ (45)తో పాటు తమిళనాడుకు చెందిన గోవిందరామ్ (36), సావధాన్, జులేఖాబీ, ఆనందన్ (61)లకు గాయాలయ్యాయి. బస్సు బోల్తా పడ్డ విషయం తెలుసుకున్న స్థానికులు హుటాహుటిన అధికారులకు సమాచారం అందించి బస్సులో గాయపడ్డ వారిని బస్సులోనుంచి పైకి తీసి ఆస్పత్రికి తరలించారు. కుప్పం ఏరియా ఆస్ప త్రిలో బాధితులను మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, తహశీల్దార్ సురేష్‌బాబు, జడ్పీటిసి, జిల్లా విద్య, వైద్య సలహా కమిటీ సభ్యులు ఎడిఎస్ శరవణ, ఆర్టీసీ డిఎం టికె స్వామి, తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు గోపీనాథ్, గాజుల ఖాదర్‌బాషా, నేతలు ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్ తదితరులు పరామర్శించారు. కాగా బస్సు బోల్తా పడిన సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పోవడం పట్ల ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈంఘటనపై ఆర్టీసీ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు విచారణ చేపట్టారు.



అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా గురువారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరినారాయణన్



అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా గురువారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

## అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు

### రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా



ఆరూరు యస్‌టి కాలనీలో గృహ ప్రవేశాలు ప్రారంభిస్తున్న మంత్రి రోజా, కలెక్టర్ హరినారాయణన్

నింద్ర, డిసెంబరు 15 ప్రభాతవార్త :

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేయడం ధ్యేయమని రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆరూరు గ్రామపంచాయితీ, ఆరూరు యస్‌టి కాలనీలోని 26 ఇంటికి చిత్తూరుజిల్లా కలెక్టర్ హరినారాయణన్, మంత్రి ఆర్‌కె రోజా గృహ ప్రవేశాలు ప్రారంభించారు. గ్రామ పంచాయితీలో గడప గడపకి మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ఆరూరు గ్రామంలో కరపత్రాలు అందజేసారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఓటువేసిన వారికి వేయని వారికి ప్రతి ఒక్కరికి వివిధ పథకాల రుపంలో సహాయం అందజేస్తున్నరని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తావుంటే టిడిపి నాయ కులు చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలు అందజేయడం వలన రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని విమర్శిస్తావుండారని తెలిపారు. తహాశీల్దారు అమరేంద్రబాబు, యంపిడిఓ వేణు, యంపిపి దీపాజలంధర్ రాజు, మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి, రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, కో ఆప్షన్ మెంబరు అనిల్, యంపిటిసిలు విజయ, విజేష్, వెలుగు ఎపియం చంద్రకళ, సిడిపిఓ శోభారాణి, నాయకులు గోపి, మహేష్, రామచంద్రారెడ్డి, తోయజాక్షి, సంపత్‌కుమార్, బాబురెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, సత్యరాజ, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా రాజగోపుర కలశ స్థాపన

### నూతన జీవ ధ్వజస్థంభ స్థాపన





కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో రాజగోపురం కలశ స్థాపన, నూతన జీవ ధ్వజస్థంభ స్థాపన, మహా సంప్రోక్షణ కార్యక్రమంను గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో రాజగోపుర కలశ స్థాపన, నూతన జీవ ధ్వజస్థంభ స్థాపన, సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు బుధవారం ప్రారంభం కాగా గురువారం రుత్వికులు అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈమేరకు 8 గంటలకు న్యితకైంకర్యము, యాగశాల ఆరాధన, చతుస్థానార్చన హోమం, న్యాసహోమం, ముఖల, శిఖర కుంభ, తత్తమ్మార్థి మంత్రహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమములను నిర్వహించారు. అనంతరం యాగశాలలో ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన ప్రధాన కలశాలను మంగళవాయిద్యాల నడుమ రాజగోపురం, నూతన ధ్వజస్థంభం వద్దకు తీసుకువెళ్ళి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ రుత్వికులు అభిషేకించి పూజలు నిర్వహించారు.

## ఆసియా చదరంగంలో
## తిరుపతికి చెందిన అక్కా చెల్లెళ్లు ప్రతిభ

### సన్మానించిన మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి క్రీడా, డిసెంబర్ 15, ప్రభాతవార్త



తిరుపతికి చెందిన అక్క చెల్లెళ్లకు మేయర్, కమీషనర్ ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. 16వ ఆసియా స్కూల్స్ చదరంగం చాంపియన్‌షిప్ 2022 చరిత్రలో మొదట సారిగా భారతదేశానికి చెందిన తిరుపతి జిల్లా, తిరుపతికి చెందిన అక్కా చెల్లెళ్లు ప్రత్యేక ఘనత సాధించారు. డిసెంబర్ మూడో తేదీ నుండి పదవ తేది వరకు శ్రీలంకలో జరిగిన చదరంగం ఛాంపియన్‌షిప్‌లో మన దేశం తరపున తిరుపతికి చెందినటువంటి అక్క, చెల్లెళ్లు త్రిపురాంబిక, శ్రీ గురు వర్షిణి ప్రాతినిధ్యం వహించారు. అండర్ 11 బాలికల విభాగంలో ఛాంపియన్, రాపిడ్ విభాగాల్లో త్రిపురాంబిక రన్నర్ ఆఫ్‌తో రెండు రజిత పథకాలు సాధించింది. అండర్ ఏడు బాలికల విభాగంలో ఛాంపియన్స్, బ్లిట్జ్ ర్యాపిడ్ విభాగాల్లో మొత్తం మూడు స్వర్ణ పథకాలను కైవసం చేసుకుని సత్తా చాటింది. ఇరువురు దేశ కీర్తి ప్రతిష్టలను చాటి జాతీయ జెండాను శ్రీలంక గడ్డపై అక్కా చెల్లెళ్లు రెపరెపలాడించారు. ఈ సందర్భంగా తిరుపతి నగర పాలక సంస్ధ కార్యాలయంలో గురువారం ఉదయం మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి ప్రత్యేక సన్మానం చేసి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ చంద్రమౌళేశ్వర రెడ్డి, సూపరింటెండెంట్ గీతం స్కూల్ కరస్పాండెంట్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు కేసుల్లో 30 ఎర్రదుంగలు పట్టివేత

### లారీ,కారు,రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం

యర్రావారిపాలెం, డిసెంబరు15ప్రభాతవార్త

మండల పరిధిలో రెండు కేసుల్లో 30 ఎర్రచందనం దుంగలతో పాటు లారీ, కారు, రెండు ద్విచక్ర వాహనాలు పట్టుకున్నట్లు సీఐ తులసీరాం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు యల్లమంద సాయికాడ గుట్ట వద్ద తనతో పాటు భాకరాపేట ఎస్సై ప్రకాష్, ఎర్రావారిపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో దాడి చేశారు. ఈదాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి ఒక లారీ, ఒక స్కూటీ, 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.28లక్షలు ఉంటుందన్నారు. అదే విధంగా 11 గంటల ప్రాంతంలో యల్లమంద క్రాస్ వద్ద అనుమానాస్పదంగా వెళుతున్న పల్సర్ మోటారు సైకిలును, ఒక కారును ముందస్తు సమాచారం మేరకు వెంబడించి పట్టుకున్నారు. ఐదు గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి వాహనాలతో పాటు 6 ఎర్రచందనం దుంగలను స్వాదీనం చేసుకున్నట్లు ఆయన చెతప్పారు. వీటి విలువ రూ 18లక్షలు ఉండవచ్చునన్నారు. పారిపోయిన వారిని గుర్తించి అరెస్టు చేయనున్నట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### ఉష్ణోగ్రతలు
15/12/2022



- తిరుపతి 29 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 24 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 30 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 31 డిగ్రీలు

### బంగారం ధరలు
15/12/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,060

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,520

### కోడిగ్రుడ్ల ధరలు
15/12/2022



కోడిగ్రుడ్డు :రూ.5.50

1 డజను: రూ.66.00

## టీచర్లను కత్తులతో బెదిరించి బంగారం అపహరణ

### బాధితులు పోలీసులకు ఫిర్యాదు



ఓజిలి, డిసెంబర్ 15, ప్రభాతవార్త

ఇద్దరు గుర్తు తెలియని దుండగులు హెల్మెట్ ధరించి పాఠశాలలోకి ప్రవేశించి ఇద్దరి ఉపాధ్యాయురాలు మెడపై కత్తి పెట్టి వారిని బెదిరించి మెడలోని సరుడును లాక్కొని వెళ్లిన ఘటన ఓజిలి మండలంలోని వాకాటి వారి కండ్రిగలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. ఉపాధ్యాయురాలు తెలిపిన వివరాలు మేరకు గురువారం మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి పాఠశాల ఆవరణంలోకి ప్రవేశించారు. అందులోని ఇద్దరు వ్యక్తులు మాత్రం హెల్మెట్ ధరించి పాఠశాలలోకి ప్రవేశించారు. విధులు నిర్వహిస్తున్న మహిళా టీచర్లు లేచి నిలబడడంతోవారు దగ్గరకు వచ్చి కత్తిని చూసి వారి మెడలోని బంగారు సరుడులను లాక్కొని వెళ్లిపోయారు. అందులోవిధులు నిర్వహిస్తున్న టీచర్ పద్మ నుంచి 4.5 సవర్ణ సరుడు సర్వతి నుంచి 4 సవర్ణ సరుడును వారు లాక్కొని వెళ్లిపోయారు. వీటి విలువ సుమారు నాలుగు లక్షల రూపాయిలు ఉంటుందని పోలీసులకు తెలిపారు. సంఘటన తెలుసుకున్న ఎంఈఓ శైలజ ఆ పాఠశాలకు వెళ్లి టీచర్లను పరామర్శించి ఓదార్చారు. హుటాహుటిన సంఘటన స్థలానికి ఎస్ఐ డి. ఆదిలక్ష్మి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి ఆగంతుకులను పట్టుకుని న్యాయం చేస్తామని తెలిపారు.

# శివయ్యకే శఠగోపం!

### స్వామివారి పూజకు చిన్నసైజు టెంకాయలు సరఫరా ప్రసాదాలకు వినియోగించే నిత్యావసరాలూ నాసిరకం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరునికి సరఫరా చేస్తున్న పూజా సామగ్రి, ప్రసాదాలకు ఉపయోగించే నిత్యావసరసరకులు నాసిరకంగా ఉంటున్నాయనే విమర్శలు చోటు చేసుకుంటుంది. అయితే వీటికి సంబంధించి ఆలయంలో పని చేస్తున్న సిబ్బంది పర్యవేక్షించలేకపోతున్నారు. కారణం ఏ కాంట్రాక్టర్ జోలికి వెళ్ళాలన్నా ఎవరో ఒక రాజకీయ పార్టీ మద్దతు ఇక్కడ సరకులు సరఫరా చేస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలకు ఒక టెంకాయ, అలాగే ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలకు టెంకాయలను ఉపయోగిస్తుంటారు. రోజులకు వేలాది పూజలు జరుగుతున్నాయి. ఆలయంలో జరిగే పూజలు, హోమాలకు సంబంధించి కనీసం 5వేల టెంకాయలు అవసరమౌతాయి. వీటిని టటెండర్లను నిర్వహించే కొనుగోలు చేస్తారు. టెండర్లు పిలిచినపుడు స్పష్టంగా ఎంత పొడవు ఉండాలి? ఎంత చుట్టుకొలత ఉండాలనే వివరాలతో పొందుపరచి టెండర్ ఖరారు చేస్తారు. అయితే ఆచరణలో ఏం



దేవస్థానంకు సరఫరా చేస్తున్న టెంకాయలు

జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

**చిన్న సైజుతో సరఫరా :**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి దీర్ఘకాలంగా చిత్తూరుజిల్లాకు చెందిన ఓ ప్రముఖ వ్యాపారి సరఫరా చేస్తున్నారు. దేవస్థానం నిబంధనల మేరకు 28 సెంటి మీటర్ల చుట్టు కొలతతో సరఫరా చేయాలి. గతంలో ఒక టెంకాయ రూ.13.70లకు సరఫరా చేసే వారు. ప్రస్తుతం కొత్త టెండర్‌మేరకు రూ.13.74లు చెల్లిస్తున్నారు. అయితే టెండర్ దారుడు టెండర్లో పేర్కొన్న ప్రకారం సరఫరా చేయటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి. దేవస్థానంకు సరఫరా చేస్తున్న టెంకాయలు సైజు కిలో మూడు కాయలు వస్తాయి. అంటే ధర రూ.28లు. అంటే ఒక టెంకాయ సరాసరి రూ.10లు కాంట్రాక్టర్‌కు పడుతుంది. దేవస్థానం కాంట్రాక్టర్‌కు మంచి ధర అందిస్తుంది. అయితే నాణ్యత ప్రకారం ఇవ్వాల్సిన టెంకాయలను సరఫరా చేయకపోవటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సరఫరా చేస్తున్న నాసిరకం, తక్కువ సైజు టెంకాయలకు సంబంధించి దేవస్థానం అధికారికి వివరణ కోరగా దేవస్థానం టెండర్లో పేర్కొన్నట్లు సైజులుంటేనే తీసుకుంటామని లేదంటే వాపసు ఇస్తామని వివరణ ఇచ్చారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పొట్టి శ్రీరాములకు నివాళి



చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త:
అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకొని జడ్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటాఇకి గురువారం జడ్పీ వైస్ చైర్మన్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ఆవరణ కోసం నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములును నిత్యం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ సూపరిటెండెంట్లు, వైకాపా నాయకకులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములుకు 'దేశం' నాయకుల నివాళి

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త:
భాషా ప్రయుక్త రాష్ట్రాలకు పునాది వేసిన తెలుగుతేజం పొట్టిశ్రీరాములు వర్ధంతి పురస్కరించుకొని గురువారం గంగినేని చెరువు వద్ద వున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలతలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మోహన్‌రాజ్, వెంకటేష్‌యాదవ్, కఠారి లావణ్య, రాజశేఖర్, రమేష్, కంద, చిన్నా, సుబ్రి, ధనలక్ష్మీ, శంకర్, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే జగనన్న ధ్యేయం

### - ఎఎంసి ఛైర్మన్ నారే సోమశేఖర్



బంగారుపాళ్యం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:
రైతు సంక్షేమమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని నూతనంగా బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నారే సోమశేఖర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో నూతన ఛైర్మన్‌గా నారే సోమశేఖర్, వైస్ ఛైర్మన్‌గా ఎస్.సర్దార్, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, ఎంపిపి అమరావతమ్మ, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, పలమనేరు, చిత్తూరు ఎఎంసి ఛైర్మన్లు హేమంత్‌రెడ్డి, రాహుల్‌రెడ్డిలు, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, మాజీ ఎంపిపి సుగుణాకర్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు కృష్ణమూర్తి, దొరస్వామి, తోట శ్రీహరి, వాణిప్రియ, కృపాసాగర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శరత్‌రెడ్డి, ప్రభునాయుడు పలువురు ఎంపిటిసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## నరసింగరాయని పేటలో ఇదేం కర్మ రాష్ట్రానికి..

చిత్తూరురూరల్, డిసెంబరు 15 ప్రభాతవార్త:
చిత్తూరు రూరల్ మండలం నరసింహరాయని పేట గ్రామపంచాయతీలో రాష్ట్ర పార్టీ ఆదేశాలమేరకు దేశం నాయకులు ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. చెత్తపన్ను, ఇంటిపన్ను, నిత్యావసర వస్తుధరలు, ఇసుక మద్యం, పెట్రోల్ ధరలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచిన ప్రభుత్వ వ్యతిరేక విధానాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ కార్యదర్శి జయచంద్రనాయుడు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మేషక్, చిత్తూరు పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు నీలకంఠనాయుడు, పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చల్లా, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు దేవరాజులనాయుడు, నియోజకవర్గఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజా, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధిలో పూర్వవిద్యార్థుల పాత్ర వెలకట్టలేనిది

చిత్తూరురూరల్, డిసెంబరు 15 ప్రభాతవార్త:
పాఠశాల అభివృద్ధిలో భాగంగా మౌళిక వసతులు కల్పించడానికి అడగగానే వంట గది నిర్మాణానికి రూ. 38వేలు సహాయ సహకారాలు అందించిన పూర్వవిద్యార్థులు (1989-90) పాత్ర వెలకట్టలేనిదని గిరింపేట నగర పాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు భోజనం వడ్డించేటప్పుడు ఎండ, వానకు ఇబ్బంది పడకుండా 1989-90 పదవతరగతి పూర్వ విద్యార్థులు వంటగది ఏర్పాటుచేయడం చాలా సంతోషకరంగా వుందనీ, అలాగే పాఠశాలలో చదువుకున్న ప్రతి వ్యక్తి ముందుకు వచ్చి సహాయసహకారాలు అందించాలని కోరారు. తాము చదువుకున్న పాఠశాలకు మౌళిక వసతులు కల్పించడంలో తమ పాత్ర వున్నందుకు చాలా సంతోషంగా వున్నట్లు పూర్వ విద్యార్థులు ఆర్. సురేంద్ర, లీలారాణిలు పేర్కొన్నారు. కాగా పూర్వ విద్యార్థుల తీసుకున్న నిర్ణయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసారు.

## పొట్టిశ్రీరాములు సేవలు మరువలేనివి

కల్లూరు, డిసెంబరు15ప్రభాతవార్త
మన రాష్ట్రానికి స్వర్గీయ పొట్టిశ్రీరాములు చేసిన సేవలు మరువలేనివని పులిచెర్ల శాఖా గ్రంథాలయాధికారి రవీంద్రబాబు అన్నారు. గురువారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా కల్లూరులోని బీడీసీ కేంద్రంలోను వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రం కోసం పొట్టిశ్రీరాములు తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. అందుకే ఆయనను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని చెప్పారు.కార్యక్రమంలో రెడ్డిహబీబ్, మహమ్మద్,మస్తాన్‌వలి, ఫయాజ్,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లప్పరెడ్డిపల్లెలో టీడీపీ 'ఇదేం కర్మ మన రాష్ట్రషానికి'

తవణంపల్లె, డిసెంబర్ 15 ప్రభాతవార్త:
తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇదేం కర్మ మాన రాష్ట్రానికి' కార్యక్రమంను మండలంలోని అరగొంగ గ్రామ పంచాయతీ నల్లప్పరెడ్డిపల్లెలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్ళి ప్రజాభిప్రాయంను సేకరించారు. ఆపార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిలీప్‌నాయుడు, జొన్నగురకల మధుకుమార్‌లు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మాజీ జడ్పీటీసీలు కోదండయ్య, వెంకటేశ్వర చౌదరి, నాయకులు సునీల్ చౌదరి, అరగొండ గిరిబాబు, శరవణ, చిట్టెమ్మ, చంద్రబాబు, షబ్బీర్, జయపాల్, మనోహర్‌నాయుడు, జగదీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో పక్కాగా క్లాప్ : మున్సిపల్ కమిషనర్



చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త:
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంను క్షేత్ర స్థాయిలో పక్కాగా చేపట్టాలని కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ డాక్టర్ జె.అరుణ క్లాప్ కార్యక్రమం అమలుపై శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ నగరాలను చెత్త రహితంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్లాప్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ విషయంను పారిశుధ్య విధులు నిర్వర్తించే సిబ్బంది గృహ యాజమానులు, దుకాణదారులు, వ్యాపారస్తులకు వివరించాలన్నారు. అలాగే యూజర్ ఛార్జీల వల్ల కలిగే లాభాలను వివరించి ప్రతి ఒక్కరు యూజర్ ఛార్జీలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిన్నయ్య, లోకనాథం, నరసింహ, వార్డు పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విధ్యను బోధించండి.

పెద్దపంజాణి డిసెంబర్ 15 ప్రభాతవార్త :
విద్యార్థులకు నాణ్యమైన విధ్యను బోధిస్తే విద్యార్థులు చురుగ్గా విధ్యను అభ్యసం చేస్తారని తరల్ సమన్వయకర్త లోకనాథం పేర్కొన్నారు.గురువారం మండలంలోని ప్రాథమిక పాఠశాల భద్రాచలం,బెరపల్లి,లింగాపురం పాఠశాలలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ఆటపాటలతో కూడిన కృత్యాధార బోధన ఎంతో అవసరమని తెలిపారు.వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సరైన పద్ధతిలో బోధన చేయడం ద్వార విద్యార్థులు చురుగ్గా విధ్యను అభ్యసం చేస్తారన్నారు.టాయ్ బేసిడ్ పెడగాజి పాఠ్యాంశాలకు ఎలా అనుసంధానం చేయాలో ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం సందర్శించిన పాఠశాలల నివేధికను మండల విధ్యాశాఖాధికారిణి హేమలతకు అందజేసారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి విషయ నిపుణులు హరిప్రసాద్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతిభ వెలికితీతకు 'ఇంటెన్సివ్ వాలంటీర్ నమోదు'

### - నెహ్రూ యువకేంద్ర సంఘటన్ రాష్ట్ర సంచాలకురాలు ఏఆర్ విజయరావు



చిత్తూరురూరల్, డిసెంబరు 15 ప్రభాతవార్త:
గ్రామీణ యువతలో వున్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీయడమే ఇంటెన్సివ్ వాలంటీర్ నమోదు కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమని నెహ్రూ యువకేంద్ర సంఘటన్ రాష్ట్ర సంచాలకురాలు ఏఆర్ విజయరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక నెహ్రూ యువకేంద్ర సమావేశ మందిరంలో ఇంటెన్సివ్ వాలంటీర్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసారు. ఆమె మాట్లాడుతూ కార్యకర్తలుగా నమోదు చేసుకున్న సభ్యులు రాష్ట్ర, కేంద్ర యువజ కార్యక్రమాలకు సంబంధించి పాల్గొనవచ్చునని, అంతేకాకుండా వివిధ ఉపాధి అవకాశాలు కూడా పొందవచ్చునని పేర్కొన్నారు. అలాగే జిల్లా యువజన అధికారి బి. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ వాలంటీర్‌గా నమోదు చేసుకొని తమ సేవలను అందించిన యువతకు ధృవ పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ గణాంకాధికారి ఎంసి బాబురెడ్డి, జాతీయ యువ కార్యకర్తలతో పాటు ఎస్వీసెట్ కళాశాలకు చెందిన జాతీయ సేవాకార్యకర్తలు పాల్గొన్నారు.

## పక్కా రీ-సర్వే కోసం గ్రామసభ



పాలసముద్రం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:
మండలంలోని సింహరాజపురం, బాలకృష్ణాపురం పంచాయతీల్లో భూములను పక్కాగా రీ-సర్వే చేయడానికి గురువారం రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సమావేశంలో సర్వేయర్ కిరణ్ మాట్లాడుతూ భూముల రీ-సర్వే కోసం ప్రతి రైతు పూర్తి సహకారం అందించాలన్నారు. భూముల పత్రాలను అందుబాటులో వుంచుకొని సర్వే సమయంలో అధికారులకు రైతులు చూపాలన్నారు. అలాగే రెండు పంచాయతీల పరిధిలోని రైతులు ఆధార్, భూమి పాసు పుస్తకం, బ్యాంకు పాసు పుస్తకం, రెండు ఫోటోలు ఇవ్వాలన్నారు. ఎవరైనా రైతులు మృతి చెంది వుంటే వారికి సంబంధిచిన వారసులు తమ పేర్లను పట్టాదారు పాసు పుస్తకాల్లో చేర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో విఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## మహిళలకు భద్రత లేని రాష్ట్రం

గుడిపాల, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ప్రస్తుత ప్రభుత్వంలో మహిళలకు ఎలాంటి భద్రత లేదని మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆరోపించారు. మండలంలోని నారగల్లు పంచాయతీలో గురువారం దేశం అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు ప్రభుత్వం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదన్నారు. పంటలు పండించిన రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మండల దేశం ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, నాయకులు విజయభాస్కర్, గుర్రప్పనాయుడు, సుధాకర్‌యాదవ్, ఆనంద్, ధనసింగ్, బొడెప్పనాయుడు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా బలోపేతానికి సమిష్టి కృషి అవసరం : జింకా

చౌడేపల్లి, డిసెంబర్ 15 ప్రభాతవార్త
గ్రామీణ స్థాయి నుంచి వైకాపా బలోపేతానికి సమిష్టి కృషి అవసరమని పుంగనూరు నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి అన్నారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో వైకాపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా రంజకపాలనను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రజా సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై చేసే విమర్శలను తిప్పికొట్టాలన్నారు. గ్రామ సారథుల నియామకాలు, వారి పనితీరును ఆయన వివరించారు.

## పాత ఆస్పత్రి భవనాల్లో మున్సిపల్ కార్యాలయం ప్రారంభం

### - మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



కుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త
కుప్పం పట్టణ నడిబొడ్డున ఉన్న పాత ఆస్పత్రి, ద్రవిడ వర్సిటీ పాత క్యాంప్ కార్యాలయ భవనాల్లో కుప్పం మున్సిపల్ కార్యాలయంను గురువారం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ ప్రారంభించారు. ఈభవనాలను గతంలో పిఇఎస్ వైద్య కళాశాల వారు తెదేపా హయాంలో లీజు తీసుకున్నారు. అయితే ఇటీవలే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు భవనాలను మున్సిపాలిటీకి అప్పగించారు. కుప్పం ప్యాలెస్ రోడ్‌లో ఉన్న మున్సిపల్ కార్యాలయంకు సుమారు 3కోట్ల వ్యయంతో నూతన భవనాలను త్వరలో నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో పాత ఆస్పత్రి భవనాల్లోకి మున్సిపల్ కార్యాలయంను మార్చినట్లు మున్సిపల్ ఛైర్మన్ డా॥సుధీర్ తెలిపారు. గురువారం ఉదయం పూజ కార్యక్రమం నిర్వహించి కార్యాలయంను ప్రారంభించారు. కార్యక్రమంలో కమీషనర్ రవిరెడ్డి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, ఎపిసిఎస్‌సి డైరెక ్టర్ శ్రీనివాసమూర్తి, కౌన్సిలర్లు సోమశేఖర్,జగన్,మోహన్‌రాం , టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ భాగ్యరాజ్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## గాయపడ్డ బాధితులకు ఆర్ధికసాయం పంపిణీ

కుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త
మండలంలోని చందం వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా పడిన సంఘటనలో గాయపడ్డ కమలమ్మకు రూ 10వేలు, అప్పన్నదొర, పాంచాలమ్మ దంపతులకు 5వేలు, వెంకటేష్‌కు 3వేలు,. జులుఖాటీకి 2వేలు, సావధాన్‌కు 2వేల వంతున వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్టీసీ ఆర్ఎం సూచనల మేరకు డిఎం డికెస్వామి నగదును మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, తహశీల్దార్ సురేష్‌బాబు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు.

## గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కుప్పంరూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త
మాండస్ తుఫాను ప్రభావం తగ్గడంతో గ్రామాల్లో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పారిశుద్ధ్యంపై దృష్టి సారిస్తున్నారు. ఎలాంటి వ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా గ్రామాల్లో రహదారుల వెంబడి బ్లీచింగ్ చల్లడంతో పాటు కాలువలను శుభ్రం చేయిస్తున్నారు. గురువారం కొటాలూరు, అడవిబూదుగూరు పంచాయతీల్లో కొటాలూరు సర్పంచ్ రాజేంద్రన్, ఇఒపిఆర్‌డి విజయ్‌దత్, కార్యదర్శి మంజునాథ్‌లు దగ్గరుండి పారిశుద్ధ్య పనులు చేయించారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## రామకుప్పం ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్

రామకుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త
రామకుప్పం మండల ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడిగా గడ్దూరుకు చెందిన ఉదయ్‌కుమార్ మాదిగను నియమించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అనుమతి లేకుండా ఎంఆర్‌పిఎస్ పేరును ఎవరూ దుర్వినియోగం చేయరాదన్నారు. అలాగే ఎంఎస్‌పి మండల అధ్యక్షుడిగా గోవిందప్పను ఎన్నుకున్నారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు విశాఖపట్నంకు చెందిన యల్లాయమ్మ అనే దాత నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు.
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో వివిధ అభివృద్ధి పథకాలకు ఓ భక్తుడు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు చెన్నైకు చెందిన నాగరాజు అనే భక్తుడు దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి 50,116 రూపాయలను, గోసంరక్షణ ట్రస్టుకు 50,116 రూపాయలను ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డికి అందజేశారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

చౌడేపల్లి, డిసెంబర్ 15 ప్రభాతవార్త
మండలంలోని పాలెంపల్లి వద్ద రూ. 3.50కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ అందించాలన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు పనులు ప్రారంభిస్తున్నట్లు జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు తెలిపారు. ఈమేరకు మండలానికి 3విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. పెద్దకొండామర్రి సర్పంచ జయసుధానాగభూషణ్‌రెడ్డి, ఎంపిపి గాజుల రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, మాజీ ఎంపిపిలు రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, వైకాపా నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

## పెరటి కోళ్ళ పెంపకంను సద్వినియోగం చేసుకోవాలి : జడ్పీటీసీ సుకుమార్

వెదురుకుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త :
పెరటి కోళ్ళ పెంపకంను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ చలం పాళ్యం సుకుమార్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం పెరటి కోళ్ళ పెంపకం యూనిట్లను పంపిణీ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి, స్వాలంభన సాధించే దిశగా ప్రభుత్వం రాయితీతో కోళ్ళను అందించడం జరుగుతుందని మహిళలు యూనిట్లను సద్వి నియోగం చేసుకుని కోళ్ళను పెంచుకోవాలన్నారు. ఒక్కొక్క యూనిట్‌కు 11 కోళ్ళు, మెడికల్ కిట్టు ఇవ్వడం జరుగుతుందని,రాయితీతో యూనిట్‌ను మూడు వేల రూ పాయలకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్ధార్ పుల్లా రెడ్డి,జిల్లా వైఎస్‌ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి కామసాని పద్మనాభ రెడ్డి, ఏపీయం కవిత, నాయకులు గోవిందన్, బండి ఆనంద రెడ్డి, దామోదరం రెడ్డి, నాగరాజు, వెంకటాచలం, సీసీలు, సంఘమిత్రాలు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ



చిల్లకూరు డిసెంబర్ 15 ప్రభాతవార్త
మండలంలోని తిప్పగుంటపాలెం గ్రామానికి 5 రోజుల నుండి వరద కారణంతో జలదిగ్ధంలో ఉన్నందున గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ గురువారం గ్రామంలో పర్యటించి 374 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కేజి కందిపప్పు,కేజి నూనెప్యాకెట్ గ్రామ సర్పంచ్ ఎల్లంటి సుకన్యా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవడం సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మన్నెం శ్రీనయ్య, తహసిల్దారు జి .స్వర్ణ, వైస్ ఎంపిపి వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, నాయకులు ఎల్లంటి సనత్‌కుమార్‌రెడ్డి,వేణుగోపాల్‌రెడ్డి, ఒ శివకుమార్,ఎస్ఐ బి.గోపాల్,విఆర్ఒ ఏడుకొండలు,పంచాయితీ కార్యదర్శలు క్రాంతి కుమార్, రమణయ్య,సచివాలయ సిబ్బంది వాలింటర్లు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు త్యాగనిరతి ఎనలేనిది



కోట,డిసెంబరు 15 ప్రభాతవార్త
ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగనిరతి ఎనలేదని కోట మండల భాజపా అధ్యక్షులు డాక్టర్, సారంగం రమేష్‌బాబు అన్నారు.పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కోటలోని శ్రీరామలు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్పిరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ తెలుగుజాతి ఉన్నంత వరకు అమరజీవిగా నిలుస్తారన్నారు.ఈ కార్యక్రమంలో అంబరిష్, వాసు,వెంకయ్య, లింగుంట వెంకటేశ్వర్లు, శరత్ చంద్రారెడ్డి, యువ నాయకులు పరుశరామ్ కరీముల్లా,తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయి విజ్ఞాన ప్రదర్శన




తడ, డిసెంబర్ 15 ప్రభాతవార్త
తడ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎంఇఓ ఇందిర ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తడ మండలం లోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. విజ్ఞాన శాస్త్రంతో పాటు గణితంలోనూ వివిధ రకాల ప్రాజెక్టులు, నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, పలువురు ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శన బడి పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసింది. చిన్నతనంలోనే మేధోసంపత్తిని ప్రదర్శించిన పిల్లలను పలువురు అభినందించారు.

## వైకాపా నేత మధుసూధన్ రెడ్డి పరామర్శించిన నేదురుమల్లి



వాకాడు, డిసెంబర్ 15, ప్రభాతవార్త
వాకాడు మండలం తూపిలి గ్రామ సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందడంతో గురువారం కర్మక్రియల సందర్భంగా రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఛైర్మన్, తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి కర్మక్రియల్లో పాల్గొని పరామర్శించారు. సర్పంచ్ మధుసూదన్ రెడ్డి తల్లి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ కుటుంబ సభ్యులను పేరుపేరునా పలకరించి మాట్లాడారు. మధుసూదన్ రెడ్డి కుటుంబానికి తాను అండగా ఉంటానని అన్నారు. ఆయన వెంట వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోధర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షులు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, వాకాడు ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, నాగూర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ



సూళ్లూరుపేట, డిసెంబర్ 15 ప్రభాతవార్త
సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేశారన్నారు. చిన్నారులకు సైతం విద్యపై మక్కువ కలిగేలా అంగన్‌వాడీలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. దీంతో ఎక్కడైతే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలో లేవో ఆ ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాలను మంజూరు చేసి నిర్మిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మి, శరత్‌గౌడ్, సన్నారెడ్డి సౌజన్య, మోహన్‌రాజారెడ్డి, సూళ్లూరుపేట వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్‌లో కాంక్రీటు తయారీపై అవగాహన సదస్సు

కోట,డిసెంబరు 15 ప్రభాతవార్త
కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో గురువారం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో జెఎస్‌డబ్ల్యు సిమెంట్ వారు కాంక్రీటు తయారీలో జిజిబిఎస్ వాడకంపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ముఖ్యఅతిథులగా ఆంధ్రప్రదేశ్ సెల్స్ మేనేజర్ రాఘవ హరినాయణ,శిశ ప్రసాద్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా హరినాయరణ్ మాట్లాడుతూ కాంక్రీటు తయారీలో బైడింగ్ మేటిరీయల్ గా వాడే సిమెంట్ యొక్క నాణ్యత కొంత మేర తగ్గించి స్టీలు ఉత్పాదన పరిశ్రమలతో లభ్యమయ్యే జిజిబిఎస్ అను వ్యర్ధ పదార్థాన్ని ఉపయోగించినట్లు అయితే అది కాంక్రీట్ యొక్క స్వభావాన్ని మార్చి కట్టడాలు నిర్మాణాలు దృడంగా ఉండేట్లు చేయడంతో పాటు వాటి యొక్క జీవిత కాలాన్ని కూడా బాగా పొడగింపు చేస్తుందన్నారు. కాంక్రీటుకు క్లోరైడ్ మరియు సల్ఫేటు వంటి హానికరమైన రసాయానాలు తట్టుకోని గణాన్ని పెంపోదిందిస్తున్నారు. నిర్మాణ రంగంలో కాంక్రీటు తయారీలో జిజిబిఎస్ అవశ్యకతను తెలియ జేస్తుందన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్. వి.విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ రంగం దృడంగా ఉండాలంటే సిమెంట్, స్టీల్ వాడకంలో ఎక్కడ రాజీ పడకూడదన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి డాక్టర్, డి.శ్రీనివాస్, డాక్టర్, పి.సుబ్బారెడ్డి,అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపిటిసి భర్తపై ఎమ్మెల్యే మండిపాటు



కోట,డిసెంబరు 15 ప్రభాతవార
కోట మండలం కొక్కుపాడు గ్రామంలో గురువారం స్థానిక శాసన సభ్యులు వెలగపల్లి వర ప్రసాద్‌రావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను మహిళల తరపున వైకాపా ఎంపిటిసి హిమబిందు భర్త వేంబేటి వెంకటకృష్ణయ్యను చెప్పాలని గ్రామంలో కొందరు కోరగా ఆమేరకు వారి తరుపున రామాలయం శిథిలావవస్థకు చేరుకొందని ఎమ్మెల్యే వర ప్రసాద్‌రావుకు చెప్పే ప్రయత్నం చేయగా ఒక్క సారిగా శాసన సభ్యులు వర ప్రసాదరావు ఆయనపై మండి పడ్డారు. అసలే నీవు ఏవరు, నీకేం సంబంధం అంటూ అసహనం వ్యక్తం చేశారు. దీంతో వెంకటకృష్ణయ్య కూడా మా గ్రామ సమస్యలను చెప్పడానికి వస్తే నీవు ఎవరు అని మాట్లాడడం సమంజసం కాదని సమాధానం ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా గత మూడేన్నరేళ్ల కాలంలో మన ప్రభుత్వం ఏమి చేసిందో గ్రామాల్లోకి వెళ్లి ఇంటింటికి వెళ్లి వివరించామని చెప్పుతుంటే ఇక్కడ మాత్రం శాసన సభ్యులు వర ప్రసాదరావు ప్రజలపై ఆగ్రహం వ్యక్తం చేయడం ఏమిటిని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మేము నిన్ను ఓట్లు వేసి గెలిస్తే నీవు మమల్ని నీవు ఎవరు అంటావా ప్రజలు ఎమ్మెల్యే వైఖరి పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఉత్తమనెల్లూరు, కొక్కుపాడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వర ప్రసాదరావు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలతో కూడిన కర్ర పత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో తహిశీల్దార్ పద్మావతి, ఎంపిడివో మారెళ్ల భవాని, మండల కన్వీనర్,పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, ఎన్‌డిసిబి డైరెక్టర్, నరమాల వెంకటరమణయ్య, యరటపల్లి మధుసూదన్ రెడ్డి మెబిన్‌భాష,తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి మూర్ఛతో చెరువులో పడి మత్స్యకారుడు మృతి

వెంకటగిరి, డిసెంబరు 15, ప్రభాతవార్త:
సోమసానిగుంట చెరువులో చేపల వేటకు వెళ్లి తుపాకుల సురేష్ (24) మూర్చ రావడంతో నీటిలోనే ప్రాణాలు వదిలాడు. గురువారం తెల్లవారుజామున సురేష్ చేపలు పట్టుకునేందుకు చెరువులోకి వెళ్లాడు. చెరువులోకి దిగిన వెంటనే మూర్చ రావడంతో విలవిలా కొట్టుకుని నీటిలో పడి మృతి చెందాడు. సురేష్‌కు ఆరు నెలల క్రితమే వివాహమైంది. సురేష్ మృతితో కుటుంబసభ్యులు రోధించారు.

# ఫిబ్రవరి చివరికి రెండోదశ జగనన్న శాశ్వత భూ హక్కు

**- భూరక్ష పత్రాలు పంపిణీ**
**- తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి**

తిరుపతిరూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు - భూరక్ష పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి పూర్తి చేయాలని సి.సి.ఎల్.ఎ.స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ ఆదేశాలు జారీ చేసారని, ఫిబ్రవరి నెల చివరికి రెండో దశను పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి చివరికి రొండో దశ 92 గ్రామాలకు చెందిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పత్రాల పంపిణీ పూర్తి కావాలని ఆదేశించారు. సిసిఎల్ఏ ఛీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ మ్యుటేషన్ కరెక్షన్, ట్రాన్సాక్షన్, కోర్ట్ కేసులో పురోగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ శాశ్వత జగనన్న భూ హక్కు-భూ రక్షా పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్ధేశించిన గడువులోపు పూర్తయ్యేలా చూడాలన్నారు. మ్యుటేషన్ కోసం అందిన ధరఖాస్తులను పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరేన్స్ అనంతరం కలెక్టర్ వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 69 గ్రామాలకు సంబంధించిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పత్రాల పంఫిణి కార్యక్రమం పూర్తయిందని, రెండో దశకు సంబంధించి 92 గ్రామాలకు గాను భూ రక్ష పత్రాల పంఫిణీ కార్యక్రమం ఫిబ్రవరి 28వ తేదిలోపు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఇప్పటివరకు 60 గ్రామాలలో పూర్తయ్యాని అధికారులు తెలపగా మిగిలిన 32 పురోగతిలో ఉన్నవాటిని వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పి.ఓ.ఎల్.ఆర్ శిక్షణా కార్యక్రమంలో పూర్తయ్యే నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఫారం-8 జనరేట్ చేసి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. కేటగిరి-4కు గాను 17 ఓ.ఆర్.ఐలు వేగవంతం చేయాల న్నారు. పూర్తిస్థాయిలో హక్కుపత్రాల పంఫిణీ చేసిన గ్రామాల్లో హద్దురాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. ఇంకా అవసరమున్న హద్దు రాళ్ళు కొరకు ఎ.పి.ఎం.డి.సి. వారికి తగినంత ఇండెంట్ పెట్టి తక్కువ లేకుండా మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. రీ సర్వే ద్వారా పంపిణీ చేసిన హక్కు పత్రాలు ఎంతో ఖచ్చితత్వంతో కూడిన యాజమాన్యపు హక్కు ధృవీకరణ పత్రాలని, వీటిపై ఎటువంటి అపోహలు ప్రజలలో కలగకుండా అవగాహన కల్పించాలన్నారు. సర్వే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మ్యుటేషన్‌కు అందిన ధరఖాస్తులను పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

## ఉద్యోగాలు కోల్పోయిన హోమ్‌గార్డులకు నియామకాల్లో ప్రాధాన్యత : ఎస్పీ

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: నకిలీ డిఓలతో హోమ్‌గార్డు ఉద్యోగాలు కోల్పోయిన వారికి ప్రస్తుతం జరిగే హోమ్‌గార్డు నియామకాల్లో అధిక ప్రాధాన్యత కల్పించనున్నట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2014-19 సంవత్సరాల మధ్య నకిలీ డిఓలతో హోమ్‌గార్డు విధులు నిర్వహిస్తున్న 87 మంది హోమ్‌గార్డులను అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్ తొలగించడం జరిగిందన్నారు. నకిలీ డిఓలతో హోమ్‌గార్డు ఉద్యోగాలు ఇప్పించిన 7 మందిని ఇప్పటికే అరెస్టు చేయడం జరిగిందన్నారు. హోమ్‌గార్డు ఉద్యోగాలు కొల్పోయిన 87 మందితో గురువారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి చిత్తూరు ఆర్మ్‌డ్ రిజర్వ్ పెరేడ్ గ్రౌండ్స్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగాలు కొల్పోయిన హోమ్‌గార్డులు ఆధైర్యపడకుండా వుండాలన్నారు. ఖాళీ అయిన హోమ్‌గార్డు పోస్టులకు త్వరలో భర్తీ చేయడానికి డిఐజి రాజేంద్రనాథరెడ్డి, ప్రభుత్వంతో చర్చించి త్వరలో నోటిఫికేషన్ జారీ అయ్యేలా చర్యలు తీసుకొంటామన్నారు. అలాగే హోమ్‌గార్డుల ఎంపికలో ప్రస్తుతం ఉద్యోగాలు కొల్పోయిన వారికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అలాగే ఇటీవల కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల అయ్యిందని ఈ పోస్టులకు అర్హత వున్న వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీలు మురళి, కృష్ణమోహన్‌లు, ఆర్ఐ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## అప్రజాస్వామిక విధానాలను అలుపెరగని పోరాటం చేద్దాం

**- తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి**



తిరుపతిరూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్నా అప్రజాస్వామిక విధానాలపై అలుపెరగని పోరాటం చేయాలని తెలుగుదేశం పార్టీ తిరుపతిరూరల్ అధ్యక్షుడు ఏ.ఈశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా 'ఇదేం ఖర్మ-మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని గురువారం పద్మావతీపురం, శ్రీనివాసపురం గ్రామ పంచాయతీలలో నిర్వహించారు. ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఇంటింటికి వెళ్ళి ప్రజా సంక్షేమంపై ఆరా! తీసారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైకాపా పాలనకు మధ్య వ్యత్యాసాలను అడిగారు. రోడ్లు బాగున్నాయా! ఇంటింటికి రేషన్ బియ్యం అందుతున్నాయా! నిత్యవసర ధరలు ఎలా ఉన్నాయి, బస్సు చార్జీలు, విద్యుత్ చార్జీలు పెంపు తదితర అంశాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ వైకాపా పాలన ప్రజలు సుభిక్షంగా లేరని, సంక్షేమంపై మహిళల పెదవి విరుపులు తప్ప సంతోషం కనబడటం లేదన్నారు. వైకాపా పాలనలో అవినీతి పెరిగిందని, భూ ఆక్రమణలు ఎక్కువైనాయని, రౌడీయిజం, దౌర్జన్యాలు ఎక్కువైనాయని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రజలకు సుస్థిర, శాంతియుత పాలన కావాలంటే మరల టిడిపి అధికారంలోకి తీసుకురావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అలిమినేని మధు, క్రిష్ణమూర్తిరెడ్డి, గోఫినాధ్, బిరుదాల భాస్కర్‌రెడ్డి, నాగూరు శ్రీనివాసులు, బాలచంద్రారెడ్డి, రవినాయుడు, ఈశ్వరయ్య, మధుశేఖర్, శ్రీను, మహేశ్వరి, హేమలత, సురేంద్రనాయుడు, వెంకటేష్, వాణి, విజయసారధి, కేశవరెడ్డి, మోహన చౌదరి, సుబ్రమణ్యంనాయుడు, వెంకటరమణరాజు, ఝాన్సీ రాణి, సావిత్రమ్మ, బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మయ్యా.. గండం గడిచింది



తడ, డిసెంబర్ 15 ప్రభాతవార్త : బంగాళా ఖాతంలో మళ్లీ అల్పపీడనం పుట్టిందన్న వాతావరణ శాఖ హెచ్చరికలకు భిన్నంగా గురువారం ఎండ కనిపించడంతో తీరప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల మాండోస్ తుపాను కారణంగా భారీవర్షాలు కురవడంతో నదులు, కాలువలు పొంగి పంట పొలాలను ముంచెత్తడంతో పాటు ఈదురు గాలుల కారణంగా పలు ఇబ్బందులు పడ్డారు. అయితే అది కళ్ల ముందు ఉండగానే మరో తుపాను పుట్టిందన్న వార్తలు భయపెట్టాయి. గురువారం ఇది తీవ్రరూపం దాలుస్తుందని కూడా అధికారులు సైతం అప్రమత్తంగా ఉన్నారు. అయితే వాతావరణం మారి మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనడంతో తడ మండలంలోని తీరప్రాంత గ్రామాల వారు హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. పులికాట్ సరస్సులో తిరిగి చేపల వేట ప్రారంభించడానికి జాలర్లు సిద్ధమవుతున్నారు. ఇరకం, వేనాడు దీవుల్లోనూ సాధారణంగానే ఎవరి పనుల్లో వారు నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

## శ్రీహరికోట ఎస్ఐగా మనోజ్‌కుమార్



తడ, డిసెంబర్ 15 ప్రభాతవార్త : శ్రీహరికోట పోలీస్ స్టేషన్ ఎస్ఐగా మనోజ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా పెళ్ళకూరు నుండి ఇక్కడి వచ్చారు. ఇంతకు ముందు షార్ ఎస్ఐగా వున్న జిలానీ భాషా వెంకటగిరి ఎస్ఐగా బదిలీ అయ్యారు.



**తడలో పొట్టి శ్రీరాములు వర్ధంతి:**
తడ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని జరుపుకున్నారు. ఎంపిడిఓ మురళీ కృష్ణ, ఇఓ పిఆర్‌డి విజయ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి శ్రీరాములు

**- అదనపు కమాండెంట్ అరుణ్ బోస్**



వెంకటగిరి, డిసెంబరు 15, ప్రభాతవార్త: ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టిశ్రీరాములు ప్రాణాలు పణంగా పెట్టారని 9వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ అదనపు కమాండెంట్ అరుణ్ బోస్ తెలిపారు. పొట్టిశ్రీరాములు వర్థంతి సందర్భంగా బెటాలియన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం పొట్టిశ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. తెలుగు ప్రజలకు పొట్టిశ్రీరాములు వలన మంచి గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఆయనను తెలుగు ప్రజలు ఎన్నటికీ మరువరానిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సత్యం నాయుడు, పరిపాలనాధికారి చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి టెన్నిస్ వాలీబాల్ జట్టుకు ఎంపికైన జిల్లా జట్టు



చిత్తూరురూరల్, డిసెంబరు 15 ప్రభాతవార్త: బిఎన్ఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం జిల్లా టెన్నిస్ వాలీబాల్ బాల, బాలికల జట్టును ఎంపిక చేసినట్లు పాఠశాల హెచ్ఎం మురళీక్రిష్ణ, జిల్లా సంఘ ఛైర్మెన్ జోసప్ పి జాయ్, అధ్యక్ష, కార్యదర్శులు నూరుద్దీన్, సాంబశివరావులు తెలిపారు. మినీ బాలుర విభాగంలో పునీత్, ప్రనవ్, శ్రీకాంత్, రోహిత్, సోహిల్, విక్రమ్, గురుదీప్ బాలికల విభాగంలో రక్షిత, సంజన, కర్లిన్, శైలజ, దుర్గ, చరిష్మ, సౌమ్యలు ఎంపికయ్యారు. సీనియర్ బాలుర విభాగంలో నవీన్, వినోద్‌కుమార్, ప్రసన్న, పాల్‌రాజ్, కిషోర్, భరత్, ముఖేష్, శివశంకర్ బాలికల విభాగంలో జెన్నిఫర్, లిఖిత, శ్రుతి, అమూల్య, అనూష, క్లారా, మౌనిక, అలాగే యూత్ బాలుర విభాగంలో షంషీర్, తరుణ్, బాబు, లోచన, సోహల్, బాబు, ప్రాక్లిన్, గౌతమ్, బాలికల విభాగంలో జాహ్నవి, రాజేశ్వరి, స్వాతి, రమ్య, ప్రీతిమ, వినోలియాలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17,18వ తేదిలలో కర్నూల్ నందు నిర్వహించే రాష్ట్రస్థాయి టెన్నిస్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

## డ్రగ్స్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

**- గాంధీ విగ్రహం ఎదుట తెలుగు యువత ఆధ్వర్యంలో నిరసన**



చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: అన్నపూర్ణగా పేరు ప్రఖ్యాతి గాంచిన ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రాష్ట్రంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మార్చివేశారని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను కట్టడి చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ స్మగ్లింగ్‌లో నెంబర్‌వన్‌గా ప్రఖ్యాతి గాంచిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందన్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారం మన రాష్ట్రంలో అత్యధికంగా 18,261 కేజీల నార్కొటిక్స్ స్వాధీనం చేసుకోవడం జరిగిందని వెల్లడించారన్నారు. నిరసన కార్యక్రమం అనంతరం జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్ ఆధ్వర్యంలో తెలుగు యువత నాయకులు చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి వరుణ్, అధికార ప్రతినిధి హేమాద్రి, పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రబాబు, యువత నగర అధ్యక్షుడు యువరాజ్, ఉపాధ్యక్షుడు హైమరాజు, నాయకులు రామ్ ప్రసాద్, గౌస్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బాలాజీ, అప్పు, మణి, యువరాజ్, తెలుగు యువత కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పెషల్ సమ్మరిలో 30 వేల దరఖాస్తులు

**- ఎలక్షన్ కమీషన్‌కు వివరించిన కలెక్టర్ హరినారాయణన్**

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ఓటర్ల సమ్మరి రివిజన్‌లో 30 వేల దరఖాస్తులు అందాయని కలెక్టర్ హరినారాయణన్ చీఫ్ ఎలక్షన్ కమీషనర్ ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమీషనర్ ముఖేష్‌కుమార్ మీనా గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు చిత్తూరు కలెక్టరేట్ నుండి హాజరైన కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలోని 7 నియోజకవర్గాలకు సంబందించి 81 శాతం 6బి పూర్తి అయ్యిందని, చిత్తూరు ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నట్లు వివరించారు. అందిన 30 వేల దరఖాస్తుల్లో 22,483 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. చిత్తూరు ఎమ్మెల్సీ స్థానం పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాలు వున్నాయని, ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ అధికారిగా డిఆర్ఓ వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే టీచర్ల ఎమ్మెల్సీ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి అభ్యంతరాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు కమిటీ సమక్షంలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎదైనా ఫిర్యాదులు వస్తే ఎన్నికల కమీషన్‌కు పంపడం జరుగుతుందన్నారు. కమీషనర్ మాట్లాడుతూ ఓటర్ల దరఖాస్తులను రాండమ్‌గా పరిశీలించాలని, డూప్లికేట్, అనుమానంగా వున్న వాటిని పరిశీలించి ఫిజికల్‌గా ఫిర్యాదు వస్తే ఎన్నికల కమీషన్‌కు పంపాలన్నారు.

# పన్ను బకాయిలకు రెడ్ నోటీసులు జారీ : మేయర్,కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 15, ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నులు కట్టకుండా ఉన్న మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మేయర్ చాంబర్లో రెవెన్యూ సిబ్బందితో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మేయర్ శిరీష, కమిషనర్‌అనుపమ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ భవనాల వారీగా విభజించాలని, మొండి బకాయిదారులు పన్నులు చెల్లించకపోతే నగరపాలక సంస్థ అందిస్తున్న సదుపాయాలను తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ మీకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసి, నూరు శాతం ఆస్తి పన్నులు రాబట్టాలని, ఆయా వార్డులు ద్వారా ఆస్తి పన్నులు వసూలు, నగర పాలక సంస్థ పరిధిలో సచివాలయాల వారిగా రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ భవనాల వారిగా విభజించాలని, నగరంలో కొత్తగా కడుతున్న అపార్ట్‌మెంట్లు, బిల్డింగులకు కొత్త పన్నులు వేయాలని, వాటి ద్వారా ఆదాయం పెరుగుతాయని తెలియజేసారు. సచివాలయ సిబ్బందితో డిమాండ్ నోటీసులు ఇప్పించాలని ఖాళీ జాగా స్థలాలకు కూడా పన్నులు వేయాలన్నారు. నగర ప్రజలను ఉద్దేశించి మేయర్, కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒక సారి ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, త్రాగు నీరు పన్నులు, యూజీడీ పన్నులు కట్టాలని, నగరంలో ప్రతి ఒక్కరికి అన్ని సదుపాయాలు కల్పిస్తామని పెండింగ్‌లో ఉన్న వాటిని పదిహేను రోజులు లోపల కట్టి నగరపాలక అభివృద్ధికి తోడ్పడా లన్నారు. ఈ సమావేశంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతు మాధవ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రాజశేఖర్, మధుసూధన్ రెడ్డి, ప్రకాష్, సూరిబాబు, శంకరయ్య, నవిన్ కుమార్, జ్యోతిష్, శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రెవెన్యూ సూపరింటెండెంట్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని సదుపాయాలు కల్పించేందుకు మంత్రి పెద్దిరెడ్డి కృషి



సదుం, డిసెంబరు15 ప్రభాతవార్త : మంత్రి స్వంత మండలమైన సదుంలో అన్ని సదుపాయాలు కల్పించేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషి చేస్తున్నట్లు మంత్రి ఓఎస్‌డీ కుమారస్వామి తెలిపారు. గురువారం ఆయన సదుంలో విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు త్రీమెన్‌కమిటీ పర్యటించింది. బీసీ బాలుర గురుకుల పాఠశాల, ప్రభుత్వ సీఎల్‌ఆర్‌సీ భవన పరిసరాలు, సదుం జిల్లా పరిసత్ ఉన్నత పాఠశాలల్లో పరిశీలించారు. దీనికి సంబందించిన రిపోర్టును ప్రభుత్వానికి అందజేస్తామని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా సదుంలోని ప్రభుత్వ ఎస్సీ సంక్షేమ వసతి గృహ ంను తనిఖీ చేశారు. ఇది చాలా పాతది కావడంతో దాని స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి ప్రతి పాదనలు తయారు చేయనున్నట్లు వారు చప్పారు. అనంతరం వారు సమావేశం నిర్వహించి మంత్రికి నివేదికను ఇచ్చేందుకు రిపోర్టును తయారు చేశారు. ఈకమిటీలో కడప ఆర్‌జేడీ పి.బాబు, పుంగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణిలు ఉన్నారు. వీరి వెంట జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, జడ్పీటీసీ సోమశేకరరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మంత్రి పిఏలు మునితుకారాం, మురళీకృష్ణారెడ్డి, బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పజురుల్లా, సర్వేయర్లు పవన్, యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మణికంఠేశ్వరాలయంకు పంచలోహ మకరతోరణం విరాళం



కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వరాలయంకు ఓ భక్తుడు గురువారం పంచలోహపు ఇత్తడి మకర తోరణంను విరాళంగా అందజేశారు. కాణిపాకం-తిరుపతి హైవేలోని రంగంపేట సప్తగిరి హోటల్ అధినేత మోహన్‌రాజ్ అనే దాత సుమారు 95 వేల రూపాయల వ్యయంతో ప్రత్యేకంగా స్వామివారికి తయారు చేయించిన పంచలోహపు ఇత్తడి మకరతోరణంను ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈమకర తోరణాన్ని ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరదునికి ఘనంగా గ్రామోత్సవం



కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజ స్వామి ఆలయంలో రాజగోపురం కలశ స్థాపన, నూతన జీవ ధ్వజస్థంభ స్థాపన, మహా సంప్రోక్షణ కార్యక్రమం సందర్భంగా గురువారం రాత్రి స్వామి వారికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం మహా సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించగా రాత్రి స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి వార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో వుంచి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, ఆలయ ఉభయదారులు, అర్చకులు పాల్గొన్నారు.

## అమరజీవి ఆశయసాధనకు కృషి



తిరుపతి, డిసెంబర్ 15ప్రభాతవార్త: అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్ర అవతరణకోసం ప్రాణాలను అర్పించాడని, మహనీయుడు ఆశయాల సాధనకు మనమంతా కృషి చేయాలని రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాయలసీమ రంగస్థలి నాయకులు సుబ్రమణ్యం యాదవ్, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, చంద్రబాబు, కెఎన్ రాజా, రాజశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి, ఏవన్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులు.. దళారులతో జాగ్రత్త : ఎస్పి



తిరుపతి క్రైం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : నిరుద్యోగులు దళారులతో జాగ్రత్తగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ప్రజలకు న్యాయస్థానాల్లో ఉద్యోగాలు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 21 నుంచి 2023 జనవరి 2 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. దళారులు ఉద్యోగాలు తీసి ఇస్తామంటూ నిరుద్యోగులను మోసం చేస్తారని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలు నిష్పక్షపాతంగా నీయామకాలు జరుగుతాయని తెలిపారు. నిరుద్యోగులు మోసం చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆర్థిక మంత్రి సతీమణి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర ప్రసాద్ సతీమణి గజలక్ష్మీ స్వామివారి దర్శినానికి విచ్చేశారు. ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో దేవస్థానం ఎఇఓ మల్లికార్జున్ ప్రసాద్ సారధ్యంలో వేదపండితులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను అంతరాలయ దర్శనం చేసుకున్న ఆమెకు శాసనసభ్యుడు సతీమణి బియ్యపు వాణి వారి సహచరులు స్వాగతం లపలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆమెకు బియ్యపు వాణి ప్రత్యేకంగా కలంకారి కళాఖండాన్ని అందించారు.

## డెయిరీ గురించి మాట్లాడే అర్హతే 'దేశం'కు లేదు: ఎమ్మెల్యే

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: చిత్తూరు విజయ డెయిరీ గురించి ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు మాట్లాడటం విడ్డూరంగా వుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు డెయిరీని వీరరాఘవులు స్థాపించి లక్షలాది మంది పాడి రైతులకు ఉపాధి కల్పించారన్నారు. అప్పటి సిఎం చంద్రబాబునాయుడు స్వప్రయోజనాల కోసం అప్పటి డెయిరీ ఛైర్మన్ బిఎన్.రాజసింహులు దివాళా తీసి మూత పడేలా చేశారన్నారు. ప్రస్తుత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాడి రైతుల ప్రయోజనాల కోసం డెయిరీకి పుర్వ వైభవం తీసుకురావడానికి ఆమూల్ డెయిరీకి అప్పగించారన్నారు. దేశంలోనే నెంబర్ వన్‌గా వున్న ఆమూల్ డెయిరీ తరువాత స్థానంలో వున్న చిత్తూరు విజయ డెయిరీని మూసి వేసిన ఘనత ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులుకే దక్కుతుందన్నారు. మాజీ సిఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులుకు దమ్ము వుంటే 700 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి చిత్తూరు డెయిరీని పునఃప్రారంభించాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. డెయిరీపై మరోసారి అవాకులు చెవాకులు మాట్లాడితే తగిన బుద్ధి చెప్తారన్నారు. డెయిరీ భూములను ఆమూల్ సంస్థకు లీజకు మాత్రమే ఇచ్చారని విక్రయించలేదని స్పష్టం చేశారు.

## వరసిద్ధుని సన్నిధిలో తెలంగాణా హైకోర్టు జడ్జి

కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త: తెలంగాణా హైకోర్టు జడ్జి జస్టిస్ సంతోష్‌రెడ్డి గురువారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి షోడషాభిషేకాలు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్ల ప్రధాన ఆలయం కంచుగడప నుంచి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది గురుదక్షిణామూర్తి. ఇక్కడి క్షేత్రపాలకుడు గురుదక్షిణామూర్తియే అంటారు. ఈ నేపధ్యంలో ఇక్కడ గురుసంక్రమణ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. అలాగే ప్రతి గురువారం స్వామి వారికి షోడషాభిషేకాలు నిర్వహించటం నిత్య పూజలుగా ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిత్యం ధార్మిక కార్యక్రమాలతో పునీతమౌతుంది. ఏ రోజు కా రోజు నిత్యసేవలతో స్వామి అమ్మవార్లు భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు వేలాది మంది భక్తులు తరలి వస్తుండగా పలు సేవలు భక్తులను ఆధ్యాత్మిక చింతనలో విలీనం చేస్తున్నాయి. ఈ నేపధ్యంలో గురువారం ఆలయంలో స్వామి అమ్మవార్లకు నిర్వహించే నిత్యకళ్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**గురుదక్షిణామూర్తికి విశేష పూజలు:**
ఇక్కడ దక్షిణామూర్తి క్షేత్రపాలకుడుగా గురుసంక్రమణ సందర్భంగా నిర్వహించే పూజలకు ఎంతో ఆదరణ ఉంది. ఇక్కడి ఆలయాన్ని భక్తుల భాగస్వామ్యంతో బంగారుతాపటం జరిపించారు. అంతేకాక గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు. ఉదయం ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో పాలు, పెరుగు, పంచామృతం, చందనం, పసుపు, తేనె, నారికేళ్ళ జలంతో అభిషేకాలు జరిపారు. తరువాత సుగంధ పరిమళ పుష్పాలతో, స్వర్ణాభారణాలతో శోభాయ మానంగా అలంకరించారు. వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామి వారికి 108 దీపాల పర్వత హారతి, చక్రహారతి, కుంభ హారతి మహామంగళ హారతులిచ్చారు. ఈ కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్, శ్రీనివాసరాజు, సురేష్ స్థానిక భక్తులు విశేష సంఖ్య హాజరైనారు. పూజలు, అభిషేకాలను ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

## రేపటి నుంచి శ్రీకాళహస్తీశ్వరుని దర్శన వేళల్లో మార్పు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా దర్శన వేళలను మార్పు చేసినట్లు ఇఓ పెకె సాగర్‌బాబు గురువారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ధనుర్మాసం ప్రారంభం అవుతుందన్నారు. ఈ నేపధ్యంలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 13 వరకు దర్శన వేళలను ఉత్సవాల వివరాల్ని ఆయన ప్రకటించారు. రెండేళ్ళ పాటు కోవిడ్ నిబంధనలతో ఏకాంతంగా నిర్వహించిన ధనుర్మాస పూజలను ఈ ఏడాది అమ్మవారి గ్రామోత్సవం ప్రతి రోజూ నిర్వహిస్తామన్నారు. నెల రోజుల పాటు దర్శన వేళలకు సంబంధించి వివరిస్తూ వేకువ జాము 3గంటలకు పురవీదుల్లో జేగంట పంపుట. 4గంటలకు మంగళవాయిద్యాలు,, 4.15 గంటలకు తిరుమంజనం 4.30గంటలకు గోపూజ, పళ్ళియార, తేవారం ఉంది. 5గంటలకు ప్రథమ కాలభికేం, (సేవలుండవు) 6గంటలకు ద్వితీయకాలాభిషేకం,(సేవల్లేదు), 7గంటలకు పరివార దేవతలకు నైవేద్యం, 7.30గంటలకు గొబ్బి ఉత్సవం (ఏకాంతం), 10.30గంటలకు ఉచ్చికాల అభికేం, సాయంత్రం 5గంటలకు ప్రదోష కాలాభిషేకం, రాత్రి మంగళవారం, బుధవారం, గురువారం రాత్రి 8.30గంటలకు పళ్ళియార, శుక్ర, శని, ఆది, సోమవారం రాత్రి 9గంటలకు పళ్ళియార కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.